## ప్రేమించాలంటూ వేధిస్తున్న యువకుడిపై కేసు

బంజారాహిల్స్,మే 5: తనను ప్రేమించాలంటూ యువతిని వెంటపడి వేధిస్తున్న యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం 12లో నివాసం ఉంటున్న నగేశ్‌యాదవ్ కొన్నేళ్లుగా అదే ప్రాంతంలో నివాసం ఉంటూ.. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. కాలేజీకి వెళ్లేటప్పుడు కూడా రోజూ వెంబడిస్తూ రెండు నిమిషాలు మాట్లాడితే నా గురించి తెలుసుకుంటావంటూ వేధించేవాడు. ఆమెను వెంబడించడంతో పాటు ఆఫీసుదాకా వచ్చి ఇబ్బందులకు గురిచేస్తుండడంతో షీటీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. అయినా పద్ధతి మార్చుకోకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బీఎన్ఎస్ 78 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు నగేశ్ యాదవ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

## రేప్ చేస్తానంటూ బెదిరింపులు.. వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,మే 5: యువతికి ఫోన్ చేసి అసభ్యకరంగా ఆమె గురించి వర్ణించడంతో పాటు రేప్ చేస్తానంటూ బెదిరించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం 10లోని ఓ బస్తీలో నివాసం ఉంటున్న యువతి కి ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి ఫోన్లు చేస్తున్నాడు. ఆమె గురించి అసభ్యంగా మాట్లాడడంతో పాటు తన కోరిక తీర్చాలంటూ వేధించాడు. కోరిక తీర్చకపోతే రేప్ చేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చందరంగం పోటీల్లో ట్విన్స్ ప్రతిభ



చిన్నారులతో కోచ్ సురేశ్ చైతన్య, తల్లిదండ్రులు

ఖైరతాబాద్, మే 5 :అంతర్జాతీయ చందరంగం పోటీల్లో నగరానికి చెందిన ట్విన్స్ ఆమయా, అనయ్ అగ్వార్లు ప్రతిభ చాటారు. సోమాజిగూడ ప్రెస్ కబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను తల్లిదండ్రులు పనాషా, వరుణ్ అగర్వాల్, చీఫ్ కోచ్ డాక్టర్ సురేశ్ చైతన్యతో కలిసి వివరించారు. ఇటీవల బోస్నియాలో జరిగిన ఎఫ్ఎం బెజిలీనా ఓపెన్ చెస్ టోర్నమెంవ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబర్చి ఫిడే రేటింగ్లో ఆమయా ఫిడే రేటింగ్లో 2004 పాయింట్లు సాధించిందని, ఆమె సోదరుడు అనయ్ అగర్వాల్ వందకు పైగా రేటింగ్ పాయింట్లు సాధించి రికార్డును నెలకొల్పాడన్నారు. ఇద్దరు ఏకగ్రా చెస్ అకాడమీ కి ఎనలేని గుర్తింపు తెచ్చారన్నారు

# సబితా ఇంద్రారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

మణికొండ, మే 5 : మహేశ్వరంలోని జలపల్లి పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తన నియోజకవర్గ ప్రజలతో కలిసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మణికొండ, నార్సింగ్ మున్సిపాలిటీల నుంచి బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి సబితా ఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం దూళిపాల మహిళా విభాగం అధ్యక్షురాలు పట్ల రూపారెడ్డి నార్సింగ్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి నాయకులు విష్ణువర్ధన్ మహమూద్ తదితరుల నేతృత్వంలో పెద్ద ఎత్తున నాయకులు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే సబితకు శుభాకాంక్షలు తెలుపుతున్న నార్సింగ్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి



బండ్లగూడ: మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు తదితరులు



బండ్లగూడ: మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ తదితరులు



శంషాబాద్ రూరల్: మాజీ మంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి జన్మదిన వేడుకల్లో శంషాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్, మండలాధ్యక్షుడు మోహన్‌రావు, మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్, గుంటి చరణ్, హన్మంత్, మహేశ్‌యాదవ్, కొమ్మగోపాల్‌లతో పాటు పలువురు పాల్గొని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.





మైలార్‌దేవ్‌పల్లి : మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి జన్మదిన వేడుకల్లో అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కౌలన్ సుభాశ్‌రెడ్డి, నరేందర్‌రావు(చిన్నా), జాలిగం చిత్తారి, రావుల జంగయ్య, అప్పారెడ్డి ముఖేశ్, పుప్పాల క్ష్మణ్, సదా, రాముయాదవ్, మహేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో ఆధార్ నమోదు కేంద్రం

ఖైరతాబాద్, మే 5 : బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో నేటి నుంచి తాత్కాలిక ఆధార్ నమోదు కేంద్రం అందుబాటులో ఉంటుందని అంబేద్కర్ సేవా సంఘం చీఫ్ ఆర్గనైజర్ కేబీ భగవాన్‌దాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జై జవాన్ జై కిసాన్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవా సంఘం, ప్రేమ్‌నగర్ మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందని, ఆధార్ నమోదు కోసం బర్త్, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లు, చిరునామా కోసం కరెంటు బిల్లుతో రావాలని సూచించారు.

## సమ్మెను జయప్రదం చేయాలి



డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న ఏఐటీయూ నాయకులు

బండ్లగూడ, మే 5. దేశ వ్యాప్తంగా మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని ఏఐటీయూ నాయకులు రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ఏఐటీయూ ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి సోమవారం రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌ను కలిసి సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు 102 సంవత్సరాల నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాల్లో 29 కార్మిక చట్టాలను రద్దు చేయాలని చూస్తున్నారని దీంతో కార్మికుల హక్కులను కాల రాస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం, కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలతో 47 కోట్ల మందికి నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు . దేశంలో ఇప్పటికే 27 సార్లు సమ్మెలు చేసి 4 కోడ్లు అమలు కాకుండా ఆపారన్నారు. బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో మళ్లీ 4కోడ్లు అమలు చేయాలని చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్మికులందరూ శాంతియుతంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా సమ్మె చేస్తామని ముందస్తు సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఆనంద్, అధ్యక్షులు సాయిలు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు జాతి నిర్మాతలుగా ఎదగాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కృష్ణమాచార్యులు

బండ్లగూడ, మే 5: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదా ధామంలో బాల బాలికల వ్యక్తిత్వ వికాసానికి సంస్కార సాధనా వర్గానిన శ్రీ సరస్వతి విద్యా పీఠం తెలంగాణ అకడమిక్ ఇన్‌చార్జి నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలబాలికలకు చక్కటి విద్యా, సంస్కారములను అందించేందుకు విద్యారంగంలో విద్యా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. శిశు మందిరంలో చదువుతున్న బాలబాలికలకే కాకుండా సమాజంలోని అందరి బాల బాలికలకు సంస్కారములు అందాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి సెలవులలో చిన్నారి బాల బాలికల వ్యక్తిత్వ వికాసమునకు అవసరమయ్యే విధంగా దేశ భక్తుల కథలు, మహాపురుషుల జీవిత చరిత్రలు, సంగీతం , వేద గణితం తదితర విషయాలు నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకావాలని సూచించారు. శ్రీ సరస్వతి విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి సీతారాములు మాట్లాడుతూ ఇలాంటి వాటిని నిత్య జీవితంలో కూడా అలవాటు చేసుకొని భవిష్యత్తులో చక్కటి మార్గదర్శకులుగా తయారు కావాలన్నారు. పారిశ్రామిక వేత్త వేద ప్రకాశ్ అగర్వాల్, చెరువు రాంబాబు, శ్రీ సరస్వతి విద్యా పీఠం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పరమానంద బన్సల్, రంగా రెడ్డి జిల్లా అధ్యక్షుడు గున్నాల దశరథ రెడ్డి, , మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజ నర్సయ్య పాల్గొన్నారు .

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖైరతాబాద్, మే 5 : బల్దియా ఎన్నికలకు కొద్ది నెలలు మాత్రమే సమయం ఉండగా, ఎట్టకేలకు బస్తీ వాసుల కష్టాలు తీరనున్నాయి. సాక్షాత్తు నగర మేయర్, బంజారాహిల్స్ డివిజన్ కార్పొరేటర్ గద్వాల్ విజయలక్ష్మి స్వహస్తాలతో ప్రేమనగర్‌లో రూ.22.30లక్షల అంచనా వ్యయంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అయితే గత రెండు నెలలుగా పనులకు నోచుకోలేదు. ఇప్పటికే రోడ్డు పనులు రెండు సంవత్సరాలు ఆలస్యం కాగా, బల్దియా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రారంభించడంతో స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పనులైనా త్వరగా పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.



ప్రేమ్‌నగర్‌లో ప్రారంభమైన సీసీ రోడ్డు పనులు

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

హిమాయత్ నగర్, మే 5: రాష్ట్రంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్ నగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ రైతులు నష్టపోయిన పంటను అంచనా వేసేందుకు ప్రభుత్వం ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. 15 రోజులుగా తెలంగాణలోని పలు జిల్లాలలో అకాల వర్షాలు కురవడం వలన రైతులు వరి పంటను నష్టపోయారని అన్నారు. అదేవిధంగా మామిడి, మిరప, మొక్కజొన్న, జొన్న, అరటి, పుచ్చకాయలు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. మార్కెట్ కు తీసుకువచ్చిన వరి ధాన్యం, మిరప పంట వర్షాలకు తడిసిపోవడం వలన రైతులు లబోదిబోమని మొత్తుకుంటున్నారని తడిసిన వరి ధాన్యాన్ని, మిరపను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి వారిని జిల్లాలకు పంపి రైతులకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## మెట్రో రైల్ చార్జీలు పెంచొద్దు

హిమాయత్ నగర్, మే 5: ఆర్థిక నష్టాలను, విద్యుత్ చార్జీల భారాన్ని బూచిగా చూపుతూ హైదరాబాద్ మెట్రో రైల్ చార్జీలు పెంచొద్దని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో మెట్రోపై రోజుకు ఐదు లక్షల మంది ప్రయాణికులు ఆధారపడుతున్నారని, అసాధారణ చార్జీల పెంపు ప్రజా రవాణా వినియోగదారులపై గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆ యన తెలిపారు. చెన్నై మెట్రో చార్జీని చివరిగా ఫిబ్రవరి 22, 2021న సవరించారని, అప్పుడు ఎక్కువ మంది ప్రయాణికులు ఈ సేవలను ఉపయోగించుకునేలా ప్రోత్సహించడానికి గరిష్ఠ చార్జీని రూ.70 నుంచి రూ.50కి తగ్గించారని, దీంతో ఆక్యుపెన్సీ పెరిగి చెన్నై మెట్రోకు నష్టాలు తగ్గాయని గుర్తు చేశారు. మెట్రో రైల్ చార్జీల పెంపు అనివార్యమని భావిస్తే ప్రయాణికులపై భారం పడకుండా ఎల్ అండ్ టీ, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఇతర ఆదాయ మార్గాలను అన్వేషించుకోవాలని కోరారు. మెట్రో చార్జీలు పెంచితే సహించేదిలేదని ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## మొక్కల విశిష్టతపై 11న అవగాహన రన్

ఖైరతాబాద్, మే 5 : వృక్షదామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కల విశిష్టత, పర్యావరణ పరిరక్షణపై ఈ నెల 11న గచ్చిబౌలి స్టేడియంలో 5కే, 3కే, 2కేబీ విభాగాల్లో అవగాహన రన్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కల్యాణి బెల్లంకొండ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కో ఫౌండర్ దక్షిత, నిత్య సంతోషిణి, ప్రమిత, మురళీ చదలవాడతో కలిసి ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యంగా నివారణే లక్ష్యంగా అమెరికాలో ఫౌండేషన్‌ను స్థాపించామన్నారు. సంస్థలో చిన్నారులే ప్రధాన భూమిక పోషిస్తారన్నారు. ప్రతి సంవత్సరం ఒక లక్ష మంది రైతులకు మొక్కలను పంపిణీ చేస్తామని, మొత్తం పది లక్షల మొక్కలు నాటాలన్నది తమ లక్ష్యమన్నారు. మంత్రులు, ఉన్నతాధికారులు హాజరవుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళ్యాణి, దక్షిత, నిత్య సంతోషిణి

# రెండు నెలలుగా జీతాలు లేవు..

### నిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుల నిరసన



దవాఖానలో ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

ఖైరతాబాద్, మే 5 : దేశంలోనే నిమ్స్ దవాఖానకు ప్రత్యేకత ఉంది. నిత్యం 3,500 మంది రోగులు, అధునాతన సౌకర్యాలు, ప్రభుత్వం నుంచి కావాల్సినంత నిధులు సమకూరుతున్న నిమ్స్ దవాఖానకు సెక్యూరిటీ వ్యవస్థ సక్రమంగా లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 24/7 రక్షణగా ఉండే సెక్యూరిటీ గార్డులు ప్రతి రెండు నెలలకోసారి వేతనాల కోసం యాజమాన్యం ముందు చేయిచాచి అడుక్కోవాల్సిన దుస్థితి దాపురించింది. సోమవారం సైతం రెండునెలల వేతనాలు చెల్లించాలంటూ సెక్యూరిటీ గార్డు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో రోగులు, వారి సహాయకులు కొంత ఇబ్బంది పడ్డారు. పదే పదే సెక్యూరిటీ ఏజెన్సీ గార్డులకు వేతనాలు చెల్లించకున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడంపై పలువురు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

**మౌనం వెనుక రహస్యమేమిటి..?**

నిమ్స్‌లో కెప్టెన్, ఓపీడీఎస్ సంస్థలకు చెందిన సుమారు 300లకు పైగా సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారు. కెప్టెన్ ఏజెన్సీ కొంత మెరుగ్గా వేతనాలు చెల్లిస్తున్నా ఓపీడీఎస్ సంస్థ మాత్రం ప్రతి రెండు నెలలకోసారి వేతనాలను ఆపుతూ గార్డుల గోసపుచ్చుకుంటుంది. సదరు సంస్థ గతంలోనే కోట్లాది రూపాయల పీఎఫ్ డబ్బులను తారుమారు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై లేబర్ కమిషనర్ నుంచి నోటీసులు సైతం అందుకున్నట్లు తెలిసింది. అన్ని తెలిసి నిమ్స్ యాజమాన్యం వారికి ఎందుకు అవకాశం ఇచ్చిందో మిలియన్ డాలర్ ప్రశ్న. ఇందులో ఓ వైద్యాధికారి చక్రం తిప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదన్న సాకులు చెబుతున్నారు తప్ప, ఏజెన్సీల ఎంపికలో యాజమాన్యం పారదర్శకత పాటించడం లేదని పలువురు నిమ్స్ ఉద్యోగులు బహిరంగానే ఆరోపిస్తున్నారు.

**ఆందోళన చేస్తాం..**

చాలీ చాలనీ వేతనాలతో నగరంలోని సెక్యూరిటీ గార్డులు బతుకీడుస్తున్నారని, వారికి జీతాల చెల్లింపుల్లోను అలసత్వం ప్రదర్శిస్తున్నారని, సకాలంలో చెల్లించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సీఐటీయూ అనుబంధ నిమ్స్ సెక్యూరిటీ గార్డు యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు ఆయన సంఘీభావం తెలిపారు.

## పంటల మార్పిడితోనే అధిక దిగుబడులు



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత సుకృత్‌కుమార్

శంషాబాద్ రూరల్, మే 5 : పంటల మార్పిడితోనే అధిక దిగుబడులు వస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త సుకృత్ కుమార్ తెలిపారు. సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ మున్సిపాలిటీ కోత్వాల్‌గూలో రైతులకు వ్యవసాయంపై మండల వ్యవసాయ అధికారి శ్వేత ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాస్త్రవేత్త సుకృత్ కుమార్ మాట్లాడుతూ పంట మార్పిడిలతో అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. రైతులు వారి భూముల్లో వ్యవసాయం చేయడానికి యూరియా, ఎరువులు మోతాదులో వాడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని వివరించారు. తక్కువ నీటితో అధికంగా దిగుబడులు సాధించడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్, విస్తరణ అధికారి సురేశ్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

హిమాయత్ నగర్, మే 5: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిం చాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్య దర్శి నరసింహ రాష్ట్ర ఉపాధ్య క్షురాలు ప్రేమ్ పావని ప్రజలకు పిలుపు నిచ్చారు. కారల్ మార్క్స్ 207 జయంతి సందర్భంగా సోమవారం హిమాయత్ నగర్ లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ లో కార్ల్‌మార్క్స్ చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ,మేధావి అభ్యుదయవాది కార్ల్‌మార్క్స్ అనేక ఆటుపోట్లు కష్టనష్టాలను, అనుభవించారని, పెట్టుబడిదారి వ్యవస్థను ఏ విధంగా ఎదుర్కోవాలి, శ్రామిక కార్మిక వర్గాన్ని ఏ విధంగా కాపాడుకోవాలని మార్క్స్ సిద్ధాంతం ద్వారా ఈ ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంక టయ్య, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, నేతలు రమేశ్, రాజేశ్, ధర్మపురి, కళ్యాణ్ బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అంజయ్యకు పరామర్శ

శంషాబాద్ రూరల్, మే 5 : అనారోగ్యానికి గురైన ఊటుపల్లి మాజీ సర్పంచ్ రాచమల్ల అంజయ్యను సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 30 ఏండ్లుగా వర్గీకరణ కోసం నిర్వహించిన ఉద్యమంలో పాల్గొన్న అంజయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి, నాయకులు చిట్టిబాబు, రత్నం, సురేశ్, రమేశ్ ఉన్నారు.

## విద్యార్థులకు సత్కారం

ఖైరతాబాద్, మే 5 : పది, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ సత్కరించింది. బడా గణేశ్ మండపంలో విద్యార్థులకు ఖైరతాబాద్ సీఐ రాజశేఖర్, ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్ కుమార్‌తో కలిసి శాలువా, నగదు పురస్కారాలను అందజేశారు. సభ్యులు వీణా మాధురి, బాలకుమార్ పాల్గొన్నారు.





విద్యార్థులను సత్కరిస్తున్న సీఐ రాజశేఖర్, రాజ్ కుమార్

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

మణికొండ, మే 5 : రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యుడు ప్రకాశ్ గౌడ్ పుట్టినరోజు వేడుకలను మైలార్‌దేవ్‌పల్లిలోని తన నివాసంలో కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి వేడులకు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ మున్సిపాలిటీ నుంచి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ ముదిరాజ్ నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు కుమార్ గౌడ్ నార్సింగ్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ యాదవ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## ఎమ్మెల్యే బర్త్‌డేతో తంటాలు

మైలార్‌దేవ్‌పల్లి: అసలే ఎప్పుడు రద్దీగా ఉండే రహదారి.. ఆపై రెండు వైపులా వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు నానా అవస్థలకు గురయ్యారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ చౌరస్తా ప్రాంతంలోని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నివాసం వద్ద ఆయన జన్మదినం సందర్భంగా లక్ష్మీగూడకు వెళ్లే ప్రధాన రహదారి ఒక వైపు వాహనాల రాకపోకలను నిలిపి వేశారు.

## పార్కింగ్ చేసిన కారు చోరీ

వెంగళరావునగర్, మే 5 : పార్కింగ్ చేసిన ఆల్టో కారు చోరీకి గురైన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వెంగళరావునగర్ కాలనీకు చెందిన వ్యాపారవేత్త కొమ్ము కళ్యాణ్ గత రెండు నెలలుగా తన కారును సిద్ధార్థ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద పార్కు చేస్తుండేవాడు. అక్కడ ఆదివారం తన కారు పార్కింగ్ చేసి తర్వాత వచ్చి చూడగా అక్కడ కారు కనిపించలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా కారు జాడ లభ్యం కాకపోవడంతో కారు చోరీకి గురైందని గ్రహించి మధురానగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నవ్వుతో మానసిక ఆరోగ్యం



మైలార్‌దేవ్‌పల్లి, మే 5: అత్తాపూర్ డివిజన్ లక్ష్మీనగర్ జీహెచ్ఎంసీ పార్కులో సోమవారం యోగా సెంటర్ ఆధ్వర్యంలో లాఫింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టగర్ కాళీ వరప్రసాద్, డాక్టర్ సీతారాంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ్వు మానసిక మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడు తుందన్నారు. కార్యక్రమంలో భానుమతి, యోగా గురువు సుధాకర్, ప్రొఫెసర్ రాఘవరెడ్డి, తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడు నేదునూరి కనకయ్య పాల్గొన్నారు.